

విద్యార్థులకు అస్వస్థత

కలుషిత ఆహారం తిని 25మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన భువనగిరిలో చోటుచేసుకుంది. - 8లో

హెల్త్ చెకప్‌కు వెళ్తూ..



ఆస్పత్రిలో హెల్త్ చెకప్ కోసం వెళ్తుండగా ఆగిఉన్న లారీని క్యాబ్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. - 8లో



అందని 'ఉపాధి' వేతనాలు

ఉపాధిహామీ పథకంలో పనికి వెళ్లిన కూలీలకు గత రెండు నెలల నుంచి వేతనాలు అందడం లేదు. - 9లో

న్యూస్‌రీల్

ముగిసిన టెన్త్ మూల్యాంకనం

- మొత్తం 1,46,229 సమాధాన పత్రాలు లెక్కింపు

భువనగిరి: పదో తరగతి పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనం శనివారం ముగిసింది. భువనగిరిలోని దివ్యబాల విద్యాలయంలో ఈ నెల 3వ తేదీన ప్రారంభించారు. 11వ తేదీన మూల్యాంకనం ముగియాల్సి ఉండగా.. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా సెలువులు రావడంతో శనివారం ముగిసింది. పట్టణంలో ఏర్పాటు చేసిన క్యాంప్‌కు మొత్తం 1,46,229 సమాధాన పత్రాలు వచ్చాయి. వీటి కోసం 413 మంది ఎగ్జామినర్లు, 68 మంది సీఈలు, 144 మంది ప్రత్యేక అసిస్టెంట్లు విధులు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం జరిగింది. ప్రతిరోజు ఒక్కో ఎగ్జామినర్‌కు 40 పేపర్ల చొప్పున అందజేసినట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు.

డిగ్రీ గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నాగార్జునసాగర్ : రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ డిగ్రీ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు మహాత్మా జ్యోతిబాపూలే బీసీ డిగ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.రవీంద్రాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరం డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోరాటాలే సమస్యల పరిష్కారానికి మార్గాలు

రామగిరి (నల్లగొండ) : పోరాటాలే సమస్యల పరిష్కారానికి మార్గాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం నల్లగొండ జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే విద్యా రంగ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం చేపట్టారు. అనంతరం ఆరాధన నిర్వహించి, స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన వంటి పూజలు నిర్వహించారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలు నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజలు జరిపించారు. సాయంత్రం మాఢవీధిలో జోడు సేవలు ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.




ఆలయంలో జోడు సేవను ఊరేగిస్తున్న అర్చకులు

పోరుకు సిద్ధం

సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్

- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్న నేతలు
- వివిధ యాత్రలతో బీజేపీ ప్రచారం ముమ్మరం
- 18న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్
- నామినేషన్ల తర్వాత ప్రచారంలో వేగం పెంచనున్న పార్టీలు



సాక్షి, యాదాద్రి: పార్లమెంట్ ఎన్నికల పోరుకు ప్రధాన రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు సన్నాహక సమావేశాల్లో బిజీగా ఉండగా.. బీజేపీ చైతన్య యాత్రలు నిర్వహిస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు జరుపుతోంది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని తుంగతుర్తి, జనగామ, ఇబ్రహీంపట్నం, నకిరేకల్, ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్ల ముఖ్య కార్యకర్తల సమావేశాలు ఇప్పటికే జరిగాయి. ఈ నెల 15న భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తల భేటీతో సమావేశాలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు హరీష్‌రావు, కేటీఆర్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, గొంగిడి సునీత, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ ఇంకా పలువురు ముఖ్య నేతలు పాల్గొంటున్నారు. ఈ నెల 18 నుంచి రోడ్‌షోలు, బహిరంగ సభల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేష్ ఈ నెల 22న నామినేషన్ వేయనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభం


కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేరును ఆలస్యంగా ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇంట్లో సమీక్షా సమావేశం నిర్వహించి భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహంపై నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, మల్‌రెడ్డి రంగారెడ్డిలతోపాటు ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఆ వెంటనే అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయి సమీక్షా సమావేశాలు జనగామ నుంచి ప్రారంభించారు. శనివారం ఆలేరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ నెల 21న నామినేషన్ కార్యక్రమం లోపు అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో సన్నాహక సమావేశాలు పూర్తి చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రచారం చేస్తున్నారు. కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే ఎన్నికల మాదిరిగా పనిచేసి పార్టీ విజయం కోసం పనిచేయాలని కోరుతున్నారు. నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్నారని ఇప్పటికే ప్రకటించారు. నామినేషన్ తర్వాత క్షేత్ర స్థాయి ప్రచారాన్ని ముమ్మరం చేసే దిశగా కాంగ్రెస్ కార్యాచరణ రూపొందిస్తోంది.

బీజేపీ యాత్రల జోరు

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టారు. ఆయన నేరుగా కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను కలిసి ఓట్లు అడుగుతున్నారు. సంకల్ప యాత్రలు కూడా పూర్తి చేశారు. 15, 16, 17 ఘర్ ఘర్ బీజేపీ, లబ్ధిదారులతో సెల్ఫీ దిగి బీజేపీకీ ఓటు అడిగే కార్యక్రమాలు పార్టీ చేపట్టింది. చేనేత చైతన్య యాత్ర కూడా నిర్వహించారు. ఆయన ఈ నెల 19న ఒక సెట్ నామినేషన్ వేయనున్నారు., 23న రెండో సెట్ నామినేషన్ కార్యక్రమానికి బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ తో భారీ జనసమీకరణకు ప్లాన్ చేస్తున్నారు.

TG కార్డులో ఛ్చాయ్!

- తెలంగాణ స్టేట్ (టీఎస్)ను తెలంగాణ (టీజీ)గా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- అందుకు అనుగుణంగా కార్డులు మార్చిన రవాణా శాఖ
- వాహనదారులకు టీజీ కార్డుల జారీ ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 1500 చొప్పున ఆర్సీ, డీఎల్ కొత్త కార్డుల పంపిణీ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : తెలంగాణ (టీజీ) పేరుతో రూపొందించిన కొత్త డ్రైవింగ్ లైసెన్స్‌లు (డీఎల్), రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) కార్డులు వచ్చేశాయి. వాహనదారులకు వాటి జారీని రవాణా శాఖ ప్రారంభించింది. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత తెలంగాణ స్టేట్ (టీఎస్) పేరుతోనే ఇన్నాళ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌సీలు, డీఎల్‌లను జారీ చేసింది. అయితే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర ప్రజలు, యువత, ప్రతి వాహనదారుడు టీజీ పేరునే వాహనాలపై రాసుకున్నారని, ఉద్యమంలో దానిని అందరూ అనుసరించారని, కాబట్టి టీఎస్ అవసరం లేదని, టీజీగా మారుస్తామని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా గత నెలలో టీఎస్‌ను టీజీగా మార్పు చేసింది. జాతీయ స్థాయిలో చెల్లుబాటు అయ్యేలా డీఎల్, ఆర్‌సీలకు కేంద్రం ఆమోదం తీసుకొని గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ మేరకు మార్పులు చేసిన కొత్త కార్డులను రవాణా శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వాటి జారీ ప్రక్రియను ఇటీవల ప్రారంభించింది.

కార్డులపై ఇదీ మార్పు..

ఇన్నాళ్లు ఆర్‌సీ, డీఎల్ కార్డులపై ఇండియన్ యూనియన్ డ్రైవింగ్ లైసెన్స్ ఇష్యూడ్ బై తెలంగాణ స్టేట్ అని ఉండటంతో పాటు కార్డుపై ఒకపక్కన సర్కిల్‌లో టీఎస్ అని ఉండేది. ఇప్పుడు దానిని మార్చి ఇండియన్ యూనియన్ డ్రైవింగ్ లైసెన్స్ ఇష్యూడ్ బై తెలంగాణ అని ముద్రించింది. అలాగే ఒక పక్కన సర్కిల్‌లో గతంలో టీఎస్ అని ఉండగా ఇప్పుడు దానిని టీజీగా మార్చింది. అలాగే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కార్డుపైనా ఇన్నాళ్లు ఇండియన్ యూనియన్ వెహికిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇష్యూడ్ బై తెలంగాణ స్టేట్ అని ఉండగా, ఇప్పుడు దానిని ఇండియన్ యూనియన్ వెహికిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇష్యూడ్ బై తెలంగాణగా మార్చింది. అలాగే కార్డుపై ఒక పక్కన సర్కిల్‌లో టీఎస్‌కు బదులు టీజీని ముద్రించింది.

వేగంగా కొత్త కార్డుల ముద్రణ..

కొత్త కార్డులను వేగంగా ముద్రించేలా రవాణా శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్ర రవాణా శాఖ నుంచి జిల్లా కార్యాలయాలకు వచ్చిన కార్డులపై వాహనాలు, వాహనదారులకు సంబంధించిన వివరాలు, డ్రైవింగ్ లైసెన్స్‌పై దానిని పొందిన వారి వివరాలను ముద్రించే ప్రక్రియ వేగవంతం చేసింది. నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలకు మొదటి విడతలో 1500 ఆర్‌సీ కార్డులను రాష్ట్ర కార్యాలయం కేటాయించగా, వాటిని ముద్రించి జారీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పుడు మరో 3,500 వేల కార్డులను ఉమ్మడి జిల్లాకు కేటాయించగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాలు వాటి ముద్రణ కార్యక్రమాన్ని చేపట్టాయి. అలాగే నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రికి కలిపి దాదాపు 4500కు పైగా డ్రైవింగ్ లైసెన్స్ కార్డులను కేటాయించగా, అందులో 1500వరకు ముద్రించి వాటి జారీని ప్రారంభించింది. మరో 3 వేల కార్డుల ముద్రణ కార్యక్రమాన్ని చేపట్టింది. త్వరలోనే వాటిని జారీచేయనుంది.

50 పార్లమెంట్ స్థానాల్లో సీపీఎం పోటీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

చౌటుప్పల్: దేశ వ్యాప్తంగా 50 పార్లమెంట్ స్థానాల్లో సీపీఎం పోటీ చేస్తుందని, మిగిలిన స్థానాల్లో ఇండియా కూటమికి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి నుంచి తమ పార్టీ పోటీలో ఉందన్నారు. అవకాశవాదులు, అవినీతిపరులు, అవసరానికి పార్టీలు మారే వ్యక్తులు ఉన్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించాలన్నారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్ మీద ఆధారపడి ఉందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ పాలనతో ఇప్పటికే దేశం కార్పొరేట్ శక్తులకు అప్పగించిందని ఆరోపించారు. పదేళ్లలో 60వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. రూ.55 లక్షల కోట్లు అప్పులు అయ్యాయన్నారు. బీజేపీని ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐ పేరుతో జైలులో వేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక ఉండాలంటే సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దోనూరి నర్సిరెడ్డి, నాయకులు అయితగోని విజయ్‌కుమార్, గంగదేవి సైదులు, ఎండీ పాష, కృష్ణారెడ్డి, నర్సింహ తదితరులున్నారు.

ఆగమైన తెలంగాణను దారికి తెస్తున్నాం



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

యాదగిరిగుట్ట: పదేళ్లలో ఆగమైన తెలంగాణను ఇప్పుడిప్పుడే దారికి తెస్తున్నామని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఆలేరు నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ దుకాణం బంద్ అయిందని, బ్రహ్మ దేవుడు వచ్చినా ఆ పార్టీ ఉండదని అన్నారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుని అప్పుల పాలు చేసిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని నాటి నుంచి పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో గాడిన పడుతుందన్నారు. ప్రజా పాలన పేరుతో ఆరు గ్యారంటీల స్కీంను అమలు చేస్తున్నామని చెప్పారు. భువనగిరి పార్లమెంట్ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించే బాధ్యత కోమటిరెడ్డి బ్రదర్స్‌ది అని పేర్కొన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో తనను ఓడించిన అందరినీ తిరిగి ఓడించి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చానని తెలిపారు. భువనగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. చామల కిరణ్ కుమార్ రెడ్డిని ఎంపీగా గెలిపించే బాధ్యత తన భుజాన వేసుకున్నానని, ఆలేరు నుంచి లక్ష మెజార్టీ ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా నిలిచిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆలేరులో గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు 50వేల మెజార్టీ ఇచ్చారని, ఇప్పుడు పార్లమెంట్ అభ్యర్థికి అంతకు మించి ఇవ్వాలన్నారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కోసం పాలన అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వచ్చిన తనను ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బాలలక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ వేణుగోపాల్, టీపీసీసీ మీడియా ఇన్‌చార్జ్ శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ధ్యాప కృష్ణారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పద్మ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రామ్‌జీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్ రెడ్డి, హజ్ కమిటీ మెంబర్ శర్ఫుద్దీన్, మున్సిపల్ చైర్మన్ సుధా, ఎంపీపీలు శ్రీశైలం, అశోక్, మంగమ్మ తదితరులున్నారు.

ప్రభుత్వానికి అవగాహన లేదు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి
- ఆలేరులో బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం

ఆలేరురూరల్: కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధిపై అవగాహన లేదని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని ఆలేరు పట్టణ కేంద్రంలోని ప్రకాష్ గార్డెన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అధ్యక్షతన ఆలేరు నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి జరిగిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన నిధులతో పనులు ప్రారంభించాల్సిన ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు నిమ్మకు నిరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు, రైతుబీమా నిధులు ఇప్పటి వరకు రైతుల ఖాతాలో జమకాలేదన్నారు. క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ కోసం రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో 250 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ రైతు రాజ్యం రావాలంటే బీఆర్‌ఎస్ గెలవాలన్నారు.

గ్యారంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీని వదలిపెట్టబోం..

ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీని వదలిపెట్టబోమని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో బీజేపీ, కాంగ్రెస్‌లు చేతులెత్తేశాయని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించుకోవడానికి అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవులను అమ్ముకుందని విమర్శించారు. రాష్ట్రాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనని, బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బడుగుల లింగయ్య, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్ గౌడ్, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ రవీందర్, జెడ్పీటీసీ అనురాధ, పుట్ట మల్లేషం, శ్రీనివాస్ వెంకటేష్, సంపత్, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

మే 30లోపు పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

- జిల్లా విద్యాధికారి నారాయణరెడ్డి

భువనగిరి రూరల్: మండలంలోని ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా విద్యాధికారి నారాయణరెడ్డి అన్నారు. శనివారం భువనగిరిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు పాఠశాలల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని, మే 30లోపు పనులు పూర్తిచేయాలన్నారు. 'సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాద్, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం ఆనంద్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బీబీనగర్: సమావేశంలో హెచ్‌ఎంలు, మహిళా సంఘాల సభ్యులు

మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

బీబీనగర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు, బాలురకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డీఈఓ నారాయణరెడ్డి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిర్వహణపై శనివారం బీబీనగర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 40పాఠశాలల్లో మౌలిక వసతుల నిర్వహణకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు ఇక నుంచి విద్యార్థుల యూనిఫాంలను కుట్టేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈ శివకుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్ ఉన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యారాధనలు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు కొనసాగాయి. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో స్వామివారి నిత్య కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగించిన అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదనచేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గడువు రెండు రోజులే..

- ఓటరు నమోదుకు ఈనెల 15న తుది గడువు
- 25న అనుబంధ జాబితా ప్రకటించేందుకు ఏర్పాట్లు

భువనగిరి: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని నిర్ణయించింది. ఈమేరకు జిల్లా అధికారులు ఓటరు నమోదుపై దృష్టి పెట్టారు. ఈ నెల 15 వరకు ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ఈ నెల 25న అనుబంధ జాబితా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఫిబ్రవరి 8న ఓటర్ల జాబితా ప్రకటించారు. ప్రస్తుతం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్త ఓటర్లకు అవకాశం కల్పించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు నమోదుకు ఇంకా రెండు రోజులే నమోదుకు సమయం ఉండటంతో యువతకు అవగాహన కల్పిస్తున్నారు. ర్యాలీలు, 5కే రన్‌లు, పోలింగ్ల బూత్ ఆధారంగా ఓటరు నమోదుకు చర్యలు చేపడుతున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పీఎస్	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
భువనగిరి	257	1,08,386	1,11,301	01	2,19,288
ఆలేరు	309	1,16,493	1,17,750	19	2,34,262
మొత్తం	566	2,24,879	2,29,051	20	4,53,550

దరఖాస్తు ఇలా..

ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఫారం- 6తో పాటు వయసు ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు జత చేసి సంబంధిత బీఎల్‌ఓకు అందించాలి. http//nvsp.in, ceotelangana.nic.in వెబ్ సైట్లను సందర్శించి నేరుగా ఆన్‌లైన్‌లో ఫారం-6ను పూరించి ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఉంది.

ఓటరు జాబితాలో పేరు తెలుసుకోవడం ఇలా..

ఓటరు జాబితాను బీఎల్‌ఓలు, పంచాయతీలు, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు.



అంతేకాకుండా ఓటరు జాబితాలో పేరు ఉందా లేదా అనేది ఆన్‌లైన్‌లోనూ తెలుసుకోవచ్చు. ఇందుకోసం search in electoral roll వెబ్‌సైట్‌ను సందర్శించాలి. ఎపిక్ కార్డు లేదా పేరుతో గాని ఫోన్ నంబర్ గాని నమోదు చేస్తే ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకోచ్చు.

క్లుప్తంగా

పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు అపహరణ

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో చైన్ స్నాచర్ పుస్తెలతాడు, నల్లపూసల తాడును అపహరించుకుపోయిన సంఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన మేకపోతుల స్వామి హైదరాబాద్ గ్రేహౌండ్స్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉగాది పండుగకు భార్య నర్మద, పిల్లలతో ఆత్మకూరు(ఎం)కు వచ్చాడు. శుక్రవారం రాత్రి ఇంటి దాబా మీదు పడుకున్నారు. ఉదయం నిద్ర నుంచి లేచే సరికి ఒంటి మీద ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడు, మూడు తులాల నల్లపూసల బంగారు తాడు అగుపించ లేదు. చైన్ స్నాచర్ ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ పి. మధుసూదన్‌రెడ్డి, ఎఎస్‌ఐ డి. నాగరాజు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

గంజాయి పట్టివేత

సూర్యాపేట: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. శనివారం సూర్యాపేట పట్టణ జేజే నగర్, తాళ్ల గడ్డకు చెందిన చరణ్, నాగరాజు హైటెక్ బస్టాండ్ సమీపంలో ఉదయం అదుపులోకి తీసుకొని 150గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. గంజాయి సేవించినా, తరలించినా, అమ్మిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చదువే ఆయుధంగా ముందుకు సాగాలి

నల్లగొండ టౌన్ : దళిత, బడుగు బలహీన వర్గాల వారు చదువే ఆయుధంగా చేసుకుని ముందుకు సాగాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం నల్లగొండలోని అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఐఏఎస్‌కు ఎంపికైన దామెర హిమవంశీ, పప్పుల భువన, ప్రణీత్‌ను ఆయన సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో బొర్ర సుధాకర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ రేఖల భద్రాద్రి, చక్రహరి రామరాజు, సుంకరి మల్లేష్, పెరిక సంహితరాణి, మామిడి ప్రమీల, కత్తుల శంకర్, బి.రాములు, ఉప్పల శ్రవణ్, దున్న యాదగిరి, కత్తుల జగన్‌కుమార్, నేలపట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

నాడు మోడువారి.. నేడు చిగురించి


ఇరవై రోజుల క్రితం ఆకులు రాలిన చెట్లు


ప్రస్తుతం చిగురించి పచ్చదనాన్ని సంతరించుకున్న చెట్లు

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఇరవై రోజుల క్రితం మోడుగా మారిన చెట్లు ప్రస్తుతం చిగురుటాకులు తొడిగి పచ్చదనంతో కళకళలాడుతూ ఇలా కనిపిస్తోంది. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి


ప్రమాదానికి కారణమైన టిప్పర్

మఠంపల్లి: రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతిచెందగా బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రఘునాథపాలెం గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. చింతలపాలెం మండలం చిత్రియాలకు చెందిన చెడవంగు కృష్ణయ్య తన కుమారుడు 4వతరగతి చదువుతున్న పవన్‌కుమార్‌కు కుక్కకాటుకు మందు వేయించేందుకు బైక్‌పై మఠంపల్లికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో రఘునాదపాలెం వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ రోడ్డుపై పడిపోగా నడుపుతున్న కృష్ణయ్య రోడ్డుకు ఎడమ పక్కన కిందపడిపోయి స్వల్ప గాయాలయ్యాయి. అయితే వెనుక కూర్చున్న బాలుడు పవన్ ఎగిరిపడి కుడి వైపున రోడ్డుపై పడిపోవడంతో వేగంగా వస్తున్న టిప్పర్ బాలుడిపై నుంచి వెళ్లింది.దీంతో బాలుడి నడుముకి,తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.స్థానికుల సమాచారంతో మఠంపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

యువకుడు అదృశ్యం


రమావత్ రంగా (ఫైల్)

త్రిపురారం : అత్తగారింటికి వచ్చిన యువకుడు కుటుంబ కలహాల కారణంగా అదృశ్యమయ్యాడు. ఈ ఘటన త్రిపురారం మండలంలోని బడాయిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో చేటుచేసుకుంది. శనివారం ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని పుట్టలగడ్డకు చెందిన రమావత్ రంగా(26)కు త్రిపురారం మండలంలోని బడాయిగడ్డ గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. గత మార్చి 29వ తేదీన రంగా బడాయి గడ్డలోని అత్తగారింటికి వచ్చాడు. అక్కడ కుటుంబంలో కలహాలు తలెత్తడంతో రమావత్ రంగా తన తల్లికి ఫోన్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో బంధువుల ఇల్లు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి రమావత్ కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హెల్త్ చెకప్‌కు వెళ్తూ.. అనంత లోకాలకు

- ఆగిఉన్న లారీని ఢీకొన్న క్యాబ్
- ఇద్దరి మృతి, మరో ఇద్దరికి గాయాలు
- మృతులు చిలుకూరు మండలం బేతవోలు వాసులు


వీరయ్య (ఫైల్)


మొగ్గయ్య (ఫైల్)

నాగోలు: ఆస్పత్రిలో హెల్త్ చెకప్ కోసం వెళ్తుండగా ఆగిఉన్న లారీని క్యాబ్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఎల్‌బీనగర్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన సాదె వీరయ్య (78), ఇదే గ్రామానికి చెందిన సుంకరి మొగ్గయ్య (60) నగర శివారు హయత్‌నగర్ సూర్యనగర్ కాలనీలో నివాసం ఉండే సాదె జగదీష్ వద్దకు శుక్రవారం వచ్చారు. శనివారం ఉదయం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో సాదె వీరయ్య హెల్త్ చెకప్‌నకు వెళ్లేందుకు ఓలా క్యాబ్‌ను బుక్ చేసుకున్నారు. కారులో డ్రైవర్‌తో పాటు వీరయ్య, మొగ్గయ్య, జగదీష్‌లు కలిసి హయత్‌నగర్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తున్నారు. ఎల్‌బీనగర్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద రోడ్డు మధ్యలో నిలిపి ఉన్న లారీని వెనక నుంచి క్యాబ్ ఢీకొంది. కారులో ఉన్న నలుగురిలో మొగ్గయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వీరయ్యను ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్ తరలించారు. తలకు తీవ్రగాయాలైన జగదీష్, కారు డ్రైవర్ కిరణ్‌కుమార్‌లను కొత్తపేటలోని ఓమ్ని హాస్పిటల్‌కు తీసకెళ్లారు. కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరయ్య మృతి చెందాడు. లారీ డ్రైవర్‌ను ఎల్‌బీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. కేసు దర్యాప్తులో ఉంది. మృతుల స్వగ్రామం బేతవోలులో విషాదం అలుముకుంది.

మెరుగైన వైద్యం అందించాలి

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నాగార్జునసాగర్ : ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీలోగల ప్రభుత్వ కమలానెహ్రూ ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను తిరిగి రోగులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో కలిసి వైదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇక్కడ సౌకర్యాలు ఉండి కూడా ప్రతి కేసును ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేయడం మానుకోవాలని సూచించారు. గైనకాలజీ డాక్టర్ ఒక్కరే ఉన్నందున నల్లగొండ ఆస్పత్రితో మాట్లాడుకుని ఇక్కడే కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్థో, ఆప్తాలమి, ఈఎన్‌టీ డాక్టర్ల సేవలు మెరుగు పరచుకోవాలన్నారు. ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని.. తాను తిరిగి వచ్చేలోగా ఇక్కడ రోగులకు సౌకర్యాలు మెరుగు పడాలన్నారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భానుప్రకాశ్ ఉన్నారు.

కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత

- ఇద్దరి పరిస్థితి విషమం
- భువనగిరి గురుకుల పాఠశాలలో ఘటన


ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


విద్యార్థులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భువనగిరి క్రైం : కలుషిత ఆహారం తిని 25మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన భువనగిరి గురుకుల పాఠశాలలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి పట్టణంలోని సాంఘీక గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మొత్తం 420 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 11న రాత్రి పాఠశాలలో ఆహారం తిని పడుకున్న విద్యార్థులు తెల్లవారుజామున వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. అందులో సుమారు 19మందిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా ఆరవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ప్రశాంత్, కళ్యాణ్ కృష్ణల పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని మీరాకల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం పాఠశాల యాజమాన్యం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సమాచారం ఇవ్వడంతో గురుకుల పాఠశాలలో స్పెషల్ క్యాంపు నిర్వహించి చికిత్స అందిస్తున్నారు. శనివారం ఉదయం మరో 8 మంది విద్యార్థులు టి.కార్తిక్, ఎం.శ్రీవాస్తవ్, ఏ.అజయ్, బి.భవిష్య, ఎస్.అజయ్, పి.రిషిత్, ఎం.జశ్వంత్, పి.జశ్వంత్‌లు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని భువనగిరి ఏరియా అస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు పేర్కొన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు తాము ఎలాంటి ఆహారం అందించలేదని, హాస్టల్‌లో సౌకర్యాలు నామమాత్రమేనని అంటున్నారు. మెరుగైన ఆహారాన్ని అందించకపోవడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

హాస్టల్‌ను సందర్శించిన డీఎంహెచ్‌ఓ పాపారావు

హాస్టల్‌లో విద్యార్థుల అస్వస్థతకు గురికాగా ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్ను డీఎంహెచ్‌లో పాపారావు సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే చికిత్సను అందిస్తున్న వివరాలు సేకరించారు.

మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్ రెడ్డి

అస్వస్థతకు గురై భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శనివారం ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థుల పరిస్థితిని విద్యార్థులు వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని సూచించారు.


విద్యార్థిని పరీక్షిస్తున్న బీజేపీ నాయకుడు బూర నర్సయ్య గౌడ్


చికిత్స పొందుతున్న విద్యార్థులు

జెడ్పీ చైర్మన్ పరామర్శ

- జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

అస్వస్థతకు గురైన గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి కోరారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే హైదరాబాద్‌లో చికిత్స పొందున్న విద్యార్థుల పరిస్థితిని తెలుసుకున్నారు.

విద్యాశాఖ అధికారులు బాధ్యత వహించాలి...

- బీజేపీ నాయకుడు బూర నర్సయ్య గౌడ్

విద్యాశాఖ అధికారులు విద్యార్థుల అస్వస్థతకు పూర్తి బాధ్యత వహించాలని మాజీ ఎంపీ బీజేపీ నాయకులు బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. భువనగిరిలో విద్యార్థుల ఆత్మహత్యలు, ఇప్పుడు అస్వస్థతలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా మారాయని విమర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్ కోరారు. శనివారం గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులను స్థానిక ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నడిగూడెం : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన నడిగూడెం మండలం రామాపురంలో శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన మోతె సైదులు తన కుటుంబంతో ఇటీవల మిరపకాయలు తెంచడానికి వలస వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చి చూడగా వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బియ్యం డబ్బాలో ఉన్న నల్లపూసల గొలుసు, అర తులం చెవుల దిద్దులు, 10 తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితుడు సైదులు తెలిపాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భువనగిరి క్రైం : గుర్తు తెలియని వ్యక్తి మహిళ మెడలో పుస్తెల తాడు అపహరించాడు. ఈ ఘటన భువనగిరి మండలంలోని వీరవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎలక్రాజుల శ్రీలత శుక్రవారం రాత్రి ఇంటి ముందు నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి మెడలోని మూడున్నర తులాల పుస్తెలతాడు దొంగిలించుకు వెళ్లాడు. కాగా అదే గ్రామంలో తల్లిగారైన సర్దార్ గోపాల్ ఇంటిలో శుభకార్యానికి వెళ్లి కుటుంబ సభ్యులతో ఇంటి ముందు అరుగు మీది పడుకుని ఉండగా ఈ దొంగతనం జరిగింది. ఈ మేరకు రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ రవి కిరణ్‌రెడ్డి, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్ శివనాగ ప్రసాద్‌లు వెళ్లి పరిశీలించారు.

పశువుల పెంటతో భూసారం పెంపు

- ఇన్‌చార్జ్ ఏడీఏ కె.సందీప్ సూచనలు

పాడి పంట

పెద్దవూర: వ్యవసాయంలో రోజురోజుకూ పెరుగుతున్న పెట్టుబడుల నేపథ్యంలో పంట దిగుబడి అధికంగా తీయాలనే ఉద్దేశంతో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రైతులు అధిక శాతం రసాయన ఎరువుల ద్వారానే పంటలను సాగు చేస్తున్నారు. వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతుల్యం లోపించి ఉత్పాదక శక్తి తగ్గుతుంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. దీంతో పశువుల ఎరువును పొలాల్లో వేయడం వలన నేలకు సహజసిద్ధంగా బలం చేకూరుతుంది. రైతులకు రసాయన ఎరువుల భారం తగ్గుతుంది. పంట దిగుబడికి దోహదపడుతుంది. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని ఇన్‌చార్జ్ ఏడీఏ కె.సందీప్ సూచిస్తున్నారు.

నత్రజని, భాస్వరం

పశువుల పేడను వేసిన తర్వాత భూమిని కలియదున్నితే నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు సూక్ష్మపోషకాలు తగిన మోతాదులో అందుతాయి. మొక్క బాగుండి మంచి దిగుబడి పొందవచ్చు. అలాగే చెరువుల్లో పూడిక తీసిన సమయంలో వచ్చే నల్లమట్టిని వ్యవసాయ భూమిలో పోయించుకుంటే భూసారం పెరుగుతుంది. ఇది నీటిని ఎక్కువగా పీల్చుకుని నేలలో చాలా సమయం వరకు తేమ ఉండేటట్లు చేస్తుంది. దీంతో మొక్కకు నీటి లభ్యత ఎల్లప్పుడూ ఉంటుంది.


పెంటను వ్యవసాయ పొలంలో కుప్పలుగా పోసిన రైతులు


పశువుల పెంటను ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు

సేంద్రియ ఎరువులతో..

పశువులు, మేకలు, గొర్రెల పేడ పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇళ్లలో ఏడాది కాలంగా ఉన్న పశువుల పెంట, చెత్త–చెదారం పూర్తిగా కుళ్లిపోతుంది. దీనిని పొల్లాలో వేయడం వలన నేలలో సారం పెరుగుతుంది. దీనిని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతోంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల పేడ ఉపయోగపడుతుంది. ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల పెంటను వినియోగించాలి. పశువుల పేడను పంట పొలాల్లో వేయడం వలన సహజ సిద్ధమైన లవణాలు పంటకు అందుతాయి.

భూసారం పదిలం

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో వెదజల్లితే వాటిలోని పోషకాలు ఆవిరి అవుతాయి. పశువుల పెంటను పొలంలో కుప్పలుగా పోసుకోవాలి. భూమిలో తగిన తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీనివలన భూసారం పెరుగుతుంది. భూమి గుల్లబారడానికి తోడ్పడుతుంది. సహజసిద్ధమైన లవణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపు చేసి మొక్కలకు అందేవిధంగా సహాయపడతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చును.

ఇలా దుక్కి దున్నాలి

దుక్కిని ఎలా పడితే అలా దున్నడం వల్ల సాగు చేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవికాలంలో మెట్ట భూములను వానాకాలం సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి నీటి వరదకు వాలు ప్రాంతంలో కొట్టుకుపోతుంది. దీంతో మెట్ట ప్రాంతాలలో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.